క్లుప్తంగా

టిడ్కో లబ్ధిదారులకు అర్హత పత్రాల పంపిణీ



పత్రాలు అందజేస్తున్న జయమనోజ్‌రెడ్డి

ఆదోని రూరల్: పట్టణంలోని కార్వన్‌పేట ప్రాంతానికి చెందిన 25 మంది టిడ్కో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి శనివారం అర్హత పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కేటాయించిన ఇళ్లల్లో జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు కృష్ణమోహన్ (కిట్టు), వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ హేమంత్‌నాయక్, నాయకులు షాషా, బేగారిశీన, ఐపీ లక్ష్మన్న పాల్గొన్నారు.

యార్డులోనే కూరగాయల మార్కెట్ నిర్వహించాలి

ఆదోని టౌన్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఝాన్సీ లక్ష్మీబాయి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను యార్డులోనే నిర్వహించాలని కోరుతూ శనివారం వ్యాపారులు శ్రీనివాసులు, గోవిందు, శీను, లతీఫ్, బాలాజీ తదితరులు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం యార్డులో జరుగుతున్న కూరగాయల మార్కెట్ రైతులకు, వ్యాపారులకు, కొనుగోలుదారులకు అనుకూలంగా ఉందన్నారు. మరోచోటుకు తరలిస్తే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని, ఆదాయం కూడా తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. అయితే తాము ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. ప్రస్తుతం యార్డులోనే మార్కెట్ జరుగుతుందని, అపోహలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం



చంద్రకాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: ఐకమత్యంతో ఏ సమస్య అయినా పరిష్కరించుకోవచ్చని కర్ణాటక రాష్ట్ర స్వకుళ సాలె సమాజ్ అధ్యక్షుడు చంద్రకాంత్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని కులస్తుల గురించి మాట్లాడారు. స్వకుళసాలె బంధువులు రాజకీయంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గణేష్‌నాగరాజు, లక్ష్మణ్, సఫారీ నాగరాజు, పంపాపతి, గోవిందరావు, ఈరన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు సూచనలిస్తున్న సీడీపీఓ నాగలక్ష్మి

మంత్రాలయం రూరల్: గర్భిణులు, బాలింతలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని చిలకలడోణ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పఖ్వాడ్‌లో భాగంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని, ఇందుకు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, టీచర్స్ రజియా, ఫాతిమా, శ్యామల, ఇందిర ఉన్నారు.

జయప్రదం చేయండి



కోసిగిలో జీపుజాతలో మాట్లాడుతున్న ప్రభాకర్

కోసిగి: రవాణా రంగా పరిరక్షణ కోసం ఏప్రిల్ 5వ తేదీన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత కోసిగికు చేరింది. ఆయన మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులైన ఆటో,లారీ, జీపు, మినీ వెహికిల్స్, ప్రైవేట్ స్కూల్ బస్సు, ప్రజా సరుకులు రవాణా చేసే డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, కార్మికులు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా నాయకులు రాజు, ఈరన్న, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం నాయకులు వీరేష్, ఆటో యూనియన్ మండల నాయకులు నాగిరెడ్డి,అమీర్, వెంకటేష్, నరసింహులు,చాకలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం

- అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా
- మంత్రాలయం నియోజకవర్గంలో 3,110 గ్రూపులకు రూ.14.29 కోట్ల విడుదల



కోసిగి స్త్రీశక్తి భవనంలో ఆసరా నిధుల విడుదలలో భాగంగా సీఎం జగనన్న ప్రసంగాన్ని తిలకిస్తున్న పొదుపు మహిళలు

కోసిగి: అక్కా చెల్లెమ్మల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు సంఘాల మహిళలకు రుణమాఫీ చేశారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతలుగా విడుదల చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నుంచి మూడో విడుత ఆసరా నిధులు విడుదల చేశారు. కార్యాక్రమాన్ని స్థానిక స్త్రీ శక్తి భవన సమావేశ భవనంలో సీఎం జగనన్న ప్రత్యక్ష ప్రసారాన్ని పొదుపు మహిళలు వీక్షించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద 3,110 గ్రూపులకు రూ.14,29,23,000 విడుదల చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే..

మహిళ ఆర్థికాభివృద్ధి కోసం ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా నగదు జమ చేయడంతో పొదుపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత అందజేయడం పట్ల వారి ఎదుగుదలకు దోహద పడుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు చేతి వృత్తులు, కిరాణా, బట్టల, కూరగాయల దుకానాలు, కుట్టు మిషన్లు, గొర్రెలు, మేకలు, ఆవులు పెంపకం, పాల వ్యాపారం తదితర రంగాల్లో రాణించి స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి చేయూతనిస్తున్నారు.

- ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 1,575 గ్రూపుల్లోని మహిళలు 15,750 మందికి గాను రూ.9.17కోట్లు, రూరల్ పరిధిలో.. 1,174 గ్రూపుల్లోని మహిళలకు రూ.5.18కోట్లు మంజూరైంది.

మండలాల వారీగా వైఎస్సార్ ఆసరా వివరాలు..

మండలం	గ్రూపులు	ఆసరా మొత్తం
కోసిగి	869	రూ.5.35కోట్లు
కౌతాళం	830	రూ.3.26కోట్లు
పెద్దకడబూరు	685	రూ.2.67కోట్లు
మంత్రాలయం	726	రూ.3.34కోట్లు
మొత్తం	3110	రూ.14.29 కోట్లు

కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నా



కోసిగి గ్రామంలో మల్లిక పొదుపు గ్రూపు సంఘం సభ్యురాలుగా చేరి బ్యాంక్ లింకేజీతో తీసుకున్న నగదుతో కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. వైఎస్సార్ ఆసరా పథకం కింద మా గ్రూపునకు రూ.1.25 లక్షలు వచ్చింది. మూడు విడుతలుగా లబ్ధి పొందాం. అదే కాక ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత పథకాలు అందడంతో వ్యాపారం నిర్వహణకు అండ లభిస్తుండటం సంతోషంగా ఉంది.

– రేఖ, కోసిగి

జీవనోపాధికి చేయూతనిస్తుంది



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాం. ఇందులో మహిళలు స్వయం పోషణ చేసుకుని కుటుంబానికి ఆండగా నిలుస్తున్నారు. వారి పిల్లలకు మంచి పాఠశాలలు, కళాశాలలో చేర్పించి మంచి విద్యను అందిస్తున్నారు. ఆయా పథకాల ద్వారా మహిళల జీవనోపాధికి ఉపయోగపడుతున్నాయి.

– సత్యమ్మ, ఏపీఎం, కోసిగి

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



శ్రీ మఠంలో జస్టిస్ పి.ఎస్.దేశాయి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి పిఎస్. దేశాయి కుటుంబ సభ్యులు శనివారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు వీరికి మఠం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు పత్ర్యేక పూజలు చేశారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, అగసలదిన్నె, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి స్వామికి పూజలు చేపట్టారు. శనివారం స్వామి వారం కావడంతో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు జరిపించారు. అలాగే స్థానిక ఆలయాల్లో పూజలు జరిగాయి.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆదోని టౌన్ : ఇచ్చిన మాట మేరకు వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయాన్ని అభినందిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎం నిర్ణయంతో ఇచ్చిన మాట తప్పడనేది మరోసారి నిరూపితమైందన్నారు. టీడీపీ హయాంలో వాల్మీకులను కరివేపాకులా వాడుకున్నారని ఆరోపించారు. ఉత్తుత్తి తీర్మానాలు చేసి కేంద్రానికి పంపామంటూ కల్లిబుల్లి మాటలు చెబుతూ కాలం గడిపారని విమర్శించారు. నియోజకవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు శివ, వెంకటేష్, కేశవ్, రాముడు, సర్వరాజు, మల్లారెడ్డి, సుంకప్ప, తిమ్మప్ప, శాంతరాజు, రాజు, రాఘవేంద్ర, గాదిలింగ, నాగన్న, శేషు, చిన్నారెడ్డి, దస్తగిరినాయుడు, జైపాల్, వి.కె.వెంకటేశులు, బ్యాంకు మల్లి, సుధాకర్, లక్ష్మన్న, దుర్గప్ప, రామకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వంకను పూడ్చి వెంచర్‌గా మార్చి..



పత్తికొండ-కర్నూలు రోడ్డులో వంక చదును చేసి వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్

పత్తికొండ రూరల్: విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు వాటిలో పాగా వేస్తున్నారు. పత్తికొండ–కర్నూలు ప్రధాన రోడ్డులోని కడుగొమ్మ వంక వద్ద ప్రభుత్వ స్థలంలో ఏకంగా ఓ ప్రైవేట్ వెంచర్ వెలిసింది.శనివారం వంకను, దాని పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ప్రొక్లయిన్‌తో చదును చేయించారు. దీనిపై తహసీల్దార్ విష్ణుప్రసాద్ వివరణ కోరగా విచారణ జరిపి వంక పోరంబోకు, ప్రభుత్వ స్థలం అక్రమించేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : క్రీడలు మానసికోల్లాన్నిస్తాయని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని భీమా ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆదోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో 2కె23 స్పోర్ట్స్ మీట్‌ను ఈనెల 20 నుంచి 25వ తేదీవరకు నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్ పోటీలు నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు శనివారం బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

పత్తికొండ రూరల్ : పదోతరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీఓ మోహన్‌దాస్ సూచించారు. శనివారం మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులకు మైత్రీచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయానికి పదిమెట్లు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విజయానికి బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ ఆర్డీఓ చేతుల మీదుగా ఎగ్జామ్ ప్యాడ్స్, కంబాక్స్‌లు, పెన్నులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం హనుమంతునాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

31 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: దైవందిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని వైఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో 31 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఈరన్న, బీసుపల్లి, రవి, లక్ష్మీనారాయణ, ఖాజ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పోటీలో పాల్గొనే జట్లు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 30 లోపు తమ జట్టు పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 9182148165, 82472 30953, 9381946539, 9951368735 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

వైభవంగా వీరభద్ర స్వామి కల్యాణం



కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున వీరభద్ర స్వామి, కాళికాదేవీలకు కల్యాణం జరిపించారు. పిడకల సమరం అనంతరం పార్వతీ పరమేశ్వరుల సమక్షంలో వీరభద్రస్వామి, కాళికాదేవీల కల్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. పురోహితులు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రాంప్రదసాద్, సర్పంచ్ తిమ్మక్క, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు వీరభద్ర స్వామి రథోత్సవం

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహా రథోత్సవం ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులకు ఆలయం వద్ద అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎట్టకేలకు ముగిసిన వేలాలు

- మున్సిపాలిటీకి దాదాపు రూ.కోటి ఆదాయం



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి



వేలంలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

ఆదోని టౌన్ : ఆదోని మార్కెట్‌ల వేలం పాటలు ఎట్టకేలకు ముగిశాయి. నాలుగుసార్లు వాయిదా పడిన మార్కెట్‌ల వేలాలు శనివారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.పలువురు కాంట్రాక్టర్లు పోటాపోటీగా పాల్గొని మార్కెట్‌లను దక్కించుకున్నారు. దీంతో మున్సిపాలిటీకి దాదాపు రూ.95 లక్షల ఆదాయం సమకూరింది. ఏటేటా మున్సిపాలిటీకి లక్షలాది రూపాయల ఆదాయం వివిధ మార్కెట్ల ద్వారా వస్తోంది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఐదోసారి వేలం పాటలు జరిగాయి. ఝాన్సీ లక్ష్మిబాయి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వేలంలో 8 మంది పాల్గొన్నారు. అందులో జైపాల్ అనే కాంట్రాక్టర్ రూ.71 లక్షలకు పాడి దక్కించుకున్నాడు. పశువులసంత, కమేళాను కాంట్రాక్టర్ దుర్గప్ప రూ.17.80 లక్షలకు సొంతం చేసుకున్నాడు. గొర్రెలసంత, కమేళాను కాంట్రాక్టర్ ఆదెప్ప రూ.5.80 లక్షలకుదక్కించుకున్నాడు. ఆయా మార్కెట్‌ల ద్వారా మున్సిపాలిటీకి రూ.94.70 లక్షలు ఆదాయం లభించింది. అయితే పశువుల సంత, గొర్రెల సంత మార్కెట్‌లను పాత చోట కాకుండా ఏప్రిల్ 1 నుంచి ఊరి బయట కాంపోస్టు యార్డు వద్ద మార్కెట్‌లను ఏర్పాటు చేస్తుండడంతో కొనుగోలుదారులు, అమ్మకందారులకు దూరం కావడం, ట్రాన్స్‌పోర్టు వసతులు లేకపోవడంతో వేలం పాటలు అనుకున్నంత స్థాయిలో పాడలేకపోయామని కొందరు కంట్రాక్టర్లు తెలిపారు.

మార్కెట్‌లలో వసతులు కల్పిస్తాం..

ఎమ్మిగనూరు రోడ్డులోని కాంపోస్టు యార్డు వద్ద ఏర్పాటు చేయనున్న పశువుల సంత, గొర్రెలు, మేకల సంతలో అమ్మకందారులు, కొనుగోలుదారులు, వ్యాపారులకు షెడ్, తాగునీటి వసతి తదితర వసతులను కల్పిస్తామని కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు.

గెజిట్ మేరకే సుంకం వసూలు చేయాలి..

మున్సిపాలిటీలోని వివిధ మార్కెట్‌లలో గెజిట్‌లో పొందుపరిచిన ధరల మేరకే సుంకం వసూలు చేయాలని, లేనిపక్షంలో లైసెన్సులను రద్దు చేసేందుకు వెనుకాడబోమని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. మార్కెట్‌లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు గతంలో అమ్మకం, కొనుగోలుదారులను దోపిడీ చేస్తున్నారని ఫిర్యాదులు చేశారని, ఇక మీదట అలా జరగకుండా చూస్తామన్నారు.

శిక్షణను వినియోగించుకోండి

ఆదోని అర్బన్: న్యాక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశం కోసం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, డీఎస్‌డీఓ శ్రీకాంత్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెయింటింగ్, ఎలక్ట్రికల్, హౌస్ వైరింగ్, ప్లంబింగ్ విభాగాల్లో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఫెయిల్ లేదా పాస్ అయిన యువకులు ఈనెల 31వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ 9908554147, 8328646601 నంబర్‌లలో సంప్రదించాలని, శిక్షణ ఇచ్చే స్థలం ఎమ్మిగనూరు సర్కిల్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటుందని సూచించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం రూరల్: మండలంలోని చిలకలడోణ గ్రామ శివారులో కారు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం ఐరనగల్లు గ్రామానికి చెందిన జంబన్న అనే వ్యక్తి ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ఇన్నోవా కారు ఢీ కొట్టి పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో జంబన్న (34) అక్కడిక్కడే మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని మంత్రాలయం పోలీసులు తెలిపారు. కాగా.. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

కౌతాళం: మండలంలోని సుళేకేరి గ్రామంలో వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో నామిని అయిన భార్య ముత్తమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేల నగదును ఎంపీటీసీ రాజేంద్ర, యువజన నాయకుడు ఆదిరెడ్డి, కార్యదర్శి వెంకటేష్ శనివారం అందజేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సాఆర్ బీమా వల్ల పేదలకు ఆసరాగా ఉంటుందని చెప్పారు.

మూడో ఏడాది ఆసరా

మంత్రాలయం రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా నిధులను విడుదల చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంతో పాటు ఆయా గ్రామాల్లో ఏపీఎం జయశ్రీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యక్రమాన్ని వీక్షించారు. మండలంలోని 726 గ్రూపుల్లోని 7,353 మంది సభ్యులకు రూ.1336.07 లక్షలు మంజూరు చేశారని ఏపీఎం వివరించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 149 కేంద్రాలు ఏర్పాటు
- డీఈఓ రంగారెడ్డి వెల్లడి



ఎమ్మిగనూరులో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ రంగారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో సమావేశమై ప్రిపరేషన్‌పై సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో మొత్తం 32,782 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు ఇప్పటికే పరీక్షల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో పాటు 1,644 మందికిపైగా ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. జిల్లాలో 11 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించామన్నారు. అలాగే పోలీస్ స్టేషన్లు దూరంగా ఉండే 16 సీ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లతో కేంద్రంలో ప్రవేశిస్తే డిబార్ చేయడం, అదే ఉపాధ్యాయులైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాకు చేరిన ప్రశ్నప్రత్రాలను పోలీస్ స్టేషన్లలో భద్రపరిచామన్నారు. ఈవిద్యాసంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నందవరం మండల పరిధిలోని కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్, ముగతి మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ హైస్కూల్, మండల కేంద్రం నందవరంలో జెడ్పీహెచ్ హై స్కూల్, కేజీబీవీ పాఠశాలలను జిల్లా విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలంటే భయం వీడాలని విద్యార్థులకు సూచించారు. టీవీలు, సెల్‌ఫోన్ల జోలికి వెళ్లకుండా బాగా చదువుకోవాలన్నారు. కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల డీఐఓ ఆదాంబాషా, పాఠశాల హెచ్ఎం గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు జిల్లా విద్యాధికారి రంగారెడ్డి ఆదేశించారు. నందవరం మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ హై స్కూల్‌లు మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మరింత బలవర్ధక ఆహారం అందించాలని గోరుముద్దలో అదనంగా రాగి జావను ప్రవేశపెట్టిందన్నారు. రాగి జావను విద్యార్థులకు నాణ్యంగా అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కేజీబీవీ పాఠశాల ఇన్‌చార్జీ హెచ్ఎం దివ్య భారతి, హెచ్ఎంలు సంజీవరాజు పాల్గొన్నారు.